

అంతా హడావిడేనా!

- ప్రారంభానికి నోచుకోని తల్లి పాల నిల్వ కేంద్రం
- సంగారెడ్డి ఎంసీహెచ్‌లో ఏడాదిన్నర కిందట ఏర్పాటు



సంగారెడ్డి ఎంసీహెచ్‌లోని తల్లి పాల నిల్వ కేంద్రం

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఏడాదిన్నర క్రితం తల్లి పాల నిల్వ కేంద్రం(ల్యాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్)ను ఏర్పాటు చేశారు. తల్లీ, బిడ్డల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతచ్చిన అప్పటి సర్కారు తల్లి పాల నిల్వ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అత్యవసర పరిస్థితులలో తల్లి పాల కొరతను తీర్చేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. నవజాత శిశువులకు పాల సమస్యను దూరం చేసేందుకు తల్లి పాల నిల్వ కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 'తల్లి పాల నిల్వ కేంద్రం ప్రారంభానికి గ్రహణం' శీర్షికన జూన్ 24న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఆ మరుసటి రోజు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి కేంద్రాన్ని పరిశీలించి ప్రారంభోత్సవానికి హడావుడి చేశారు. ఆ అధికారులు పరిశీలించి ఏడు నెలలు కావొస్తున్నా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోకపోవడం లేదని మహిళలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. తల్లిపాల సమస్యతో ఇబ్బందులు పడే బాలింతలు ఈ కేంద్రం ద్వారా ఉచితంగా తల్లి పాలు పొందవచ్చు.

మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లోని మొదటి అంతస్థులో మదర్ మిల్క్ బ్యాంకును ఏర్పాటు చేశారు. రూ.3 లక్షల నిధులతో ఫర్నిచర్ పార్టీషన్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ తదితర ఆధునీకరణ పనులను పూర్తి చేశారు. రూ.9.59 లక్షల నిధులతో తల్లి పాల నిల్వకు సంబంధించిన పరికరాలు సమకూర్చారు. టీఎస్ఎంఎస్ఐడీసీ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో పనులు చేపట్టగా, ఏడాదిన్నరైనా ప్రారంభోత్సవానికి మాత్రం జిల్లా యంత్రాంగం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తున్నది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమయం ఇవ్వని పక్షంలో కలెక్టరైనా స్పందించి ప్రారంభానికి చర్యలు కోరుతున్నారు.

డిసెంబరు 1న న్యాల్‌కల్ మండలం డపూర్‌లో ఓ బాలికకు వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.. డిసెంబరు 4న అందోల్ మండలం నేరడిగుంటలో 15 ఏళ్ల బాలికకు పెళ్లి చేయడానికి సిద్ధమయ్యారు... డిసెంబరు 6న ఝరాసంగం మండలం చీల్కేపల్లిలో 17 ఏళ్ల బాలికకు వివాహం చేసేందుకు పూనుకున్నారు....

ఈ మూడు ఘటనల్లో సకాలంలో సమాచారం అందడంతో పోలీసులు, సంక్షేమ, రెవెన్యూ శాఖల అధికారులు అప్రమత్తమై బాల్యవివాహాలను అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు, కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహాలు చేయడంతో కలిగే అనర్థాలను వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా బాలలకు వివాహాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కానీ, ఇప్పటికీ అనేకమంది బాల్యంలోనే వివాహ బంధంలో బంధీ అవుతున్నారు. కొందరు గోప్యంగా వివాహ తంతు చేపడుతుండడంతో సమాచారం అందక అధికారులు నిలవరించలేకపోతున్నారు.



పుత్తడిబొమ్మకు పెళ్లి సంకెళ్లు

వివాహ బంధంలో బాల్యం బంధీ

కంప్యూటర్ యుగంలోనూ బాల్యవివాహాలు

ఆర్థిక సమస్యలు, నిరక్షరాస్యతే కారణం

ఈ ఏడాది అడ్డుకున్న బాల్య వివాహాలు	
సంగారెడ్డి జిల్లాలో	23
మెదక్ జిల్లాలో	28

సంగారెడ్డి క్రైం/మెదక్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చదువుకోవాల్సిన వయసులోనే బాలికలకు పెళ్లి పేరిట సంకెళ్లు పడుతున్నాయి. ఆడపిల్లలు పుట్టగానే బాధ్యతగా కాకుండా భారంగా భావిస్తూ కంప్యూటర్ యుగంలోనూ తల్లిదండ్రులే వారి పిల్లల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆర్థిక సమస్యలు, నిరక్షరాస్యత కారణంగా బాల్య వివాహాలు తగ్గడం లేదు. ముఖ్యంగా గిరిజన తండాల్లో బాల్య వివాహాలు గోప్యంగా జరుగుతున్నాయి. చట్టాలు ఎన్ని ఉన్నా బాల్య వివాహాలు వ్యవస్థకు సవాలుగా మారాయి.

మారుమూల పల్లెల్లో ఎక్కువగా..

ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగవారికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం జరిపించాలనే నిబంధనలు వున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో, గిరిజన తండాల్లో మాత్రం ఇవేమీ అమలు కావడం లేదు. మారుమూల పల్లెల్లో తల్లిదండ్రులు ఆడ పిల్లలకు 13 ఏళ్లు నిండగానే పెళ్లిళ్లు జరిపించి తమ బాధ్యత, బరువు తీరిందన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఝరాసంగం, అందోల్, న్యాల్‌కల్, నారాయణఖేడ్, కంగ్టి, కల్హేర్, మనూరు, చిలప్‌చెడ్, రేగోడు, కౌడిపల్లి లాంటి తదితర మండలాల్లోని మారూమూల గ్రామాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. ఈ సంవత్సరం జనవరి నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో 23, మెదక్ జిల్లాలో 28 బాల్య వివాహాలను సంక్షేమ శాఖ అధికారులు అడ్డుకున్నారు. మెదక్ జిల్లాలో ఒక చిలిప్‌చెడ్ మండల పరిధిలో స్త్రీ, శిశు సంక్షేమ అధికారులు 15 పెళ్లిలను ఆపారు. జిల్లా సంక్షేమ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. సమాజంలో ఆడపిల్లలకు ఉన్న అభద్రతా భావాన్ని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు బాల్య వివాహాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఆడ పిల్లకు వివాహం జరిపిస్తే ఓ పనైపోతుందనే భావనతోనే ఎక్కువ మంది బాల్యంలోనే వివాహాలను చేస్తున్నట్లు తెలుస్తోంది.

చట్టం ఏం చెబుతోంది

బాల్య వివాహాల నిరోధక చట్టం 1929లో అమలులోకి వచ్చింది. 2006లో ఈ చట్టాన్ని ప్రభుత్వం మరింత పటిష్ఠవంతం చేసింది. బాల్య మిగతా 8వ పేజీలో

బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై వివరిస్తున్నాం

పెళ్లి పేరిట బాలికలకు సంకెళ్లు వేయడం సరికాదు. అన్ని కళాశాలలు, కేజీబీవీ పాఠశాలలు, బీసీ సంక్షేమ హాస్టళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పిల్లలకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు సవివరంగా వివరిస్తున్నాం. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల బాలికలకు జరిగే నష్టాన్ని గురించి వివరించడంతో పాటు వినకుంటే కేసులు కఠినంగా ఉంటాయని కూడా తెలియజేస్తున్నాం. బాల్య వివాహాలు జరిపించిన ఇరువర్గాల తల్లిదండ్రులు, పురోహితులు, పెళ్లికి హాజరైన పెద్దలు, బంధువులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నాం. ఎక్కడ బాల్య వివాహాలు జరిపినా వెంటనే 1098, 100,108 నంబర్లకు ఫిర్యాదు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధుల సహకారంతోనే అడ్డుకోవడం సాధ్యమవుతుంది.

-కె.లలితకుమారి, సంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖాధికారి

పెడచెవిన పెడితే కేసులు నమోదు చేస్తాం

బాల్య వివాహాలు చేసుకున్న అమ్మాయిల పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉంటుంది. చిన్నతనంలోనే కుటుంబ పోషణ, పిల్లల బాధ్యత మోస్తూ అనారోగ్యపాలయ్యే ప్రమాదం ఉంది. బాల్య వివాహాలు అరికట్టడానికి ప్రతి నెలా రెండో వారంలో మెదక్ జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పాఠశాలల్లో, అంగన్‌వాడీ స్కూళ్లలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు విద్యార్థినులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. బాలబాలికలకు పెళ్లిళ్లు జరిపితే చట్ట ప్రకారం శిక్షార్హులు. పెడచెవిన పెడితే కేసులు నమోదు చేస్తాం. బాల్య వివాహాలు జరుగుతున్న సమాచారాన్ని మాకు టోల్ ఫ్రీ నంబర్ 1098 ద్వారా అందిస్తే వెంటనే నివారించడానికి అవకాశం ఉంటుంది.

- కరుణ, మెదక్ జిల్లా బాలబాలికల సంరక్షణ అధికారి

ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటు చేయాలి

- రేపు డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమం
- పండుగ వాతావరణంలో నిర్వహణ
- పాల్గొనున్న మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ గురుకుల, పాఠశాలలు, వసతిగృహాల్లో వచ్చే సోమవారం వరకు ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వసతి గృహవార్డెన్‌లు, ఎంఈవో, హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని 14న జిల్లా వ్యాప్తంగా 80 విద్యాసంస్థల్లో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ముఖ్యఅతిథిలతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని తెలిపారు. పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఈవో రాధాకిషన్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నీలిమ, ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమాధికారులు శశికళ, జగదీష్, జమ్లా నాయక్, వసతి గృహ వార్డెన్, ఎంఈవో, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పొడ్చన్‌పల్లి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

పాపన్నపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఉదయం మండలంలోని పొడ్చన్‌పల్లి పీహెచ్‌సీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది అటెండెన్స్, ఓపీ, మందుల స్టాక్ రిజిస్టర్‌లను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ సకాలంలో హాజరై రోగులకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు

- సిబ్బంది సమయపాలన పాటించాలి
- డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి
- కంగ్టి పీహెచ్‌సీ సందర్శన



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి

కంగ్టి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రుల్లో సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేదిలేదని డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి హెచ్చరించారు. 'డాక్టర్ వచ్చారా?' అనే శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన వార్తకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. కంగ్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆస్పత్రి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఆస్పత్రి పనులపై ఏఅధికారి అయినా వెళ్లాల్సి వస్తే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో తప్పకుండా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్త విషయమై సంబంధిత అధికారులతో వివరణ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నాగమణి, సూపర్‌వైజర్‌లు, కమల, శాంత, స్టాఫ్‌నర్సులు తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేటలో అర్ధాంతరంగా నిలిచిపోయిన వెజ్-నాన్‌వెజ్ భవన సముదాయం

అభివృద్ధి సగమే!

- సదాశివపేటలో నిలిచిన ప్రగతి పనులు
- అధ్వానంగా సిద్ధాపూర్ రోడ్డు..
- అతీగతీ లేని వెజ్-నాన్‌వెజ్ మార్కెట్
- అసంపూర్తిగా హైవే 65పై సెంట్రల్ మీడియన్ పనులు
- వచ్చే నెలతో ముగియనున్న మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం

సదాశివపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట పట్టణంలో వివిధ నిధులతో చేపట్టిన పలు పనులు అసంపూర్తిగా మిగిలాయి. నిధుల లేమీతో కొన్ని పనులు సగం.. సగం పూర్తి కాగా, మరికొన్ని సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లకు నిలిపివేశారు. ఓవైపు మరో నెలన్నర రోజుల్లో మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం ముగియనుంది. ఈ సగం.. సగం పూర్తయిన పనులకు ఎప్పటికి మోక్షం లభిస్తుందో చూడాలి. అంతేకాకుండా పాలకవర్గం పట్టణాభివృద్ధి కోసం ప్రతిపాదించిన మరికొన్ని పనులకు ఇప్పటికీ ఆమోదం లభించలేదు.

ఎస్‌డీఎఫ్ నిధులు వెనక్కు

మూడేళ్ల క్రితం అప్పటి సీఎం ప్రకటించిన రూ.25 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులను వాడుకోవడంలో బల్దియా విఫలమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులను రద్దు చేయడంతో పట్టణంలో సగం.. సగం పూర్తయిన పనులకు నిధుల లేక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గత సర్కారు మంజూరు చేసిన స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు (ఎస్‌డీఎఫ్) రూ.25 కోట్లతో మున్సిపాలిటీ పరిధిలో 324 అభివృద్ధి పనులు జరగాల్సి ఉండగా రూ.16 కోట్లతో 183 పనులను మాత్రమే పూర్తి చేశారు. మరో రూ.9 కోట్లు ఖర్చు చేసి 141 పనులు పూర్తి చేయాల్సి ఉన్నదని అధికారులు చెబుతున్నారు. కానీ, ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన పనుల్లో రూ6.50 కోట్ల కొత్తగా నిర్మిస్తున్న సిద్ధాపూర్ కాలనీ డబుల్ రోడ్డు ప్రాథమిక దశలోనే నిలిచిపోయింది. రూ.2 కోట్లతో నిర్మించాల్సిన దోబీఘాట్ పనులు ఆదిలోనే హంసపాదు మిగతా 8వ పేజీలో



సిద్ధాపూర్ కాలనీకి వెళ్లే డబుల్ రోడ్డు నిర్మాణం పనులను మధ్యలోనే నిలిపేసిన కాంట్రాక్టర్

అరగంట ముందే గేట్‌కు తాళం

- గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు
- సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్
- మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

మెదక్ అర్బన్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో 15, 16 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ మెంచు నగేష్ తెలిపారు. గంటన్నర ముందు నుంచే పరీక్ష కేంద్రంలోనికి అభ్యర్థులను అనుమతిస్తామని, అరగంట ముందే గేట్‌కు తాళం వేస్తామని, అభ్యర్థులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 9908696575ను సంప్రదించి, నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్వో భుజంగరావు, మెదక్, తూప్రాన్, నర్సాపూర్ ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

25న కృషి విజ్ఞాన కేంద్రానికి ఉపరాష్ట్రపతి, గవర్నర్ రాక

కౌడిపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రానికి(కేవీకే) 25వ తేదీన ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విచ్చేస్తున్నట్లు సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ నల్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల సమావేశంలో వారు పాల్గొననున్నారు. వారితో పాటు రాష్ట్ర మంత్రులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మేరకు కేవీకేలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న 500 మంది రైతులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేవీకేలో వ్యవసాయ, సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే షురూ

- అక్కడక్కడా మొరాయిస్తున్న మొబైల్ యాప్
- అవగాహన లేమితో సిబ్బందికి ఇబ్బందులు



సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 12: ఇందిరమ్మ ఇళ్ల సర్వే మెదక్ జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. పట్టణంలోని 32 వార్డుల్లో మున్సిపల్ సిబ్బందితో పాటు వార్డు ఆఫీసర్లు గురువారం సర్వేలో పాల్గొన్నారు. కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బంది చేపడుతున్న వివరాల సేకరణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఇందిరమ్మ ఇళ్లు ఇన్‌స్పెక్షన్ మొబైల్ యాప్' ద్వారా సేకరించిన వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులు, ఇంటి స్థలాల ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 32 వార్డులకుగాను 12 మంది వార్డు ఆఫీసర్లు మాత్రమే విధుల్లో పాల్గొంటున్నారు. మిగతా 20 మందిని టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బందిని నియమించారు. కలెక్టర్ సిబ్బందికి ఫోన్ ఇన్‌లో శిక్షణ ఇచ్చినప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. లబ్ధిదారుల ఫోన్ నంబర్ల ఆధారంగా ఇంటింటికి వెళ్లి సర్వే చేయాల్సి రావడంతో, వార్డు ఆఫీసర్లతో పాటు ఇతర శాఖల అధికారులకు వార్డుల్లో ఇళ్లు దొరకడం లేదు. ఇళ్ల పరిశీలనలో తమతో పాటు మెప్మా మహిళలు ఉంటే సులభతరంగా ఉండేదని పేర్కొంటున్నారు. యాప్‌లో స్థలం, ఉన్న ఇంటిని ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉండగా మొబైల్ యాప్ అప్పుడప్పుడు మొరాయిస్తుందని సిబ్బంది వాపోయారు.



మెదక్ శివారులో మంచు కురుస్తుండడంతో హెడ్‌లైట్ వేసుకున్న ద్విచక్ర వాహనదారుడు

మళ్లీ గజగజ

మెదక్ జిల్లాలో సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు

శివ్వంపేటలో కనిష్ఠంగా 9.4 డిగ్రీలు

మెదక్ అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో మళ్లీ చలి తీవ్రత పెరిగింది. మొన్నటి వరకు 20 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు సైతం కురియడంతో శీతలగాలుల తగ్గి, చలి ప్రభావం కనిపించలేదు. కానీ రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు 9 డిగ్రీలకు పడిపోయింది. దీంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. రానున్న రోజుల్లో మరింత చలి తీవ్రత పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. గడిచిన 24 గంటల్లో మెదక్ జిల్లా శివ్వంపేటలో 9.4 డిగ్రీల సెల్సీయస్‌గా నమోదైంది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 9.5, నల్లవల్లిలో 9.7, కంగ్టిలో 9.8, సిద్దిపేట జిల్లా పోతారెడ్డిపేటలో 10.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జనవరిలో చలి మరింత విజృంభిస్తుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- వేర్వేరు చోట్ల ఘటనలు
- చేగుంట పట్టణంలో దంపతులను ఢీకొట్టిన డీసీఎం
- భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు
- జగదేవ్‌పూర్, మిరుదొడ్డిలో ఒక్కొక్కరు దుర్మరణం

7

మెదక్ చర్చి అభివృద్ధికి రూ.29.18 కోట్లు

- టూరిజం స్పాట్‌గా అక్కన్నపేట అటవీ ప్రాంతం
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

7

రైతుల చూపు.. శనగ, మక్క వైపు

- ఝరాసంగం మండలంలో 4600 ఎకరాల్లో పంట

6

రైతుల చూపు శనగ, మక్క వైపు..

ఝరాసంగం మండలంలో 4600 ఎకరాల్లో పంట

ఝరాసంగం, డిసెంబరు 12: దిగుబడులు రాక, ధర లేకపోవడంతో ఈసారి పత్తి పంట రైతులకు ఎంతగానో నష్టాన్ని మిగిలించింది. ఈ నష్టాల నుంచి గట్టెక్కాలనే ఆలోచనతో రైతులు శనగ, మక్కజొన్న పంటల వైపు చూస్తున్నారు. మండల కేంద్రమైన ఝరాసంగంతో కుప్పానగర్, మాచూనూర్, బర్దీపూర్, బొరెగావ్, జీర్లపల్లి, ఏడాకులపల్లి, బోప్పన్‌పల్లి గ్రామాల్లో ఈ పంటలను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. సుమారు 4 వేల ఎకరాల్లో శనగ, 600 ఎకరాల్లో మక్కజొన్నను సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సాగు చేసి 15 నుంచి 20 రోజులు కావడంతో మొలక దశలో కనిపిస్తున్నాయి. శనగలు, మక్కలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉండటంతో పాటు మండలంలోని వ్యవసాయ పరపతి సంఘంలో కొనుగోలు చేయడంతో రైతుల ఆశలన్నీ వీటిపైనే ఉన్నాయి.

బొరెగావ్ గ్రామ శివారులో సాగు చేసిన శనగ పంట





బర్దీపూర్ గ్రామ శివారులో సాగవుతున్న మక్కజొన్న



తోటబావి ప్రాంగణంలోని కల్యాణవేదిక ఆవరణలోని భద్రకాళి, వీరభద్రుడి ఆలయమండపాలు



బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా తోటబావి వద్ద భద్రకాళి, వీరభద్ర పళ్లెరం నిర్వహిస్తున్న వీరశైవార్చకులు

ఈసారైనా ప్రతిష్ఠించేనా?

- ప్రతిష్ఠాపనకు నోచని భద్రకాళి, వీరభద్రుడు, విజయగణపతి విగ్రహాలు
- రెండేళ్ల క్రితమే తేదీ ఖరారు.. విభేదాలతో నిలిచిన వైనం
- రెండు వారాల్లో స్వామి వారి కల్యాణం

చేర్యాల, డిసెంబరు 12 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయవర్గం నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లుగా భద్రకాళి, వీరభద్రుడు, విజయగణపతి దేవతామూర్తుల విగ్రహాలు ప్రతిష్ఠాపనకు నోచుకోవడం లేదు. 2022 మే 12న ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ ఆలయవర్గాల మధ్య నెలకొన్న విభేదాల వల్ల అర్థాంతరంగా నిలిపేశారు. మరో రెండువారాల్లో మల్లన్న కల్యాణం జరగనుండడంతో ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకైనా ప్రతిష్ఠిస్తారా? లేదా అన్న విషయమై స్పష్టత లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో యేటా మూడు నెలలపాటు కొనసాగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా అగ్నిగుండాలు నిర్వహిస్తారు. అందుకు సూచకంగా వీరభద్రుడు, భద్రకాళి అమ్మవారి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. గతంలో రాజగోపుర ఆవరణలో నిర్వహించినా, 2014 నుంచి తోటబావి ప్రాంగణంలోని కల్యాణ వేదికపై నిర్వహిస్తున్నారు. యేటా తాత్కాలికంగా నిర్వహిస్తుండటంతో ఆయా దేవతామూర్తుల విగ్రహాలను శాశ్వతంగా నెలకొల్పి పూజలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ తోటబావి ప్రాంగణంలో వేలాది రూపాయలు వెచ్చించి మండపాలను నిర్మించారు. అలాగే వాస్తురీత్యా అనుకూలత కోసం రాజగోపుర నైరుతిదిశ ఆవరణలో విజయ గణపతి మండప నిర్మాణాలను పూర్తిచేశారు. దేవతామూర్తుల విగ్రహాలను తీసుకొచ్చి ప్రతిష్ఠాపనకు చర్యలు తీసుకున్నారు. పాలకమండలి సమావేశంలోనూ తీర్మాణం చేసి 2022, మే 12 నుంచి 14వతేదీ వరకు ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి ముందస్తుగా రుత్విక్కులతో అలాగే స్థానిక నేతల అనుమతితో తేదీలు ఖరారు చేయకుండా హడావిడిగా ప్రకటించారు. కానీ ఆయా విషయాలలో అప్పటి పాలక వర్గం, ఆలయవర్గాల మధ్య పొసగకపోవడంతో వాయిదాపడింది. అప్పటి నుంచి రెండున్నరేళ్లుగా ఆయా దేవతామూర్తుల విగ్రహాలు గదికే పరిమితమై ప్రతిష్ఠానకు ఎదురుచూస్తున్నాయి. ఈ విషయమై ఆలయవర్గాలు ఆ ఊసెత్తకపోవడంతో నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికైనా చోద్యంవీడి దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ చేపట్టాలని మల్లన్న భక్తులు కోరుతున్నారు.



వాస్తుదోష నివారణకు ఆలయ రాజగోపుర ప్రాంగణంలోని విజయగణపతి మండపం

చైన్ స్నాచర్ అరెస్ట్

పటాన్‌చెరు, డిసెంబరు, 12(ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేసినట్లు గురువారం పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ్‌ఖేడ్ పరిధిలోని నిజాంపేట మండలానికి చెందిన చెందిన బుద్దం దత్తురాజు (24) జులాయిగా తిరుగుతూ పటాన్‌చెరు పరిసరాలలో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 3న ఇంద్రేశం ప్రాంతానికి చెందిన గొల్ల భాగ్యమ్మ తన నాలుగేళ్ల కుమారుడిని స్కూల్ నుంచి ఇంటికి తీసుకెళ్తుండగా, వెనక నుంచి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లాడు. ఈ మేరకు పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయగా, సుమారు 150 కెమెరాలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. గురువారం ఉదయం మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న బుద్దం దత్తురాజును అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. ఈ మేరకు అతడి నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడు, బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా మహాపడి పూజ



అయ్యప్ప పడి పూజకు హాజరైన మంత్రులు, కాంగ్రెస్ శ్రేణులు

రామచంద్రాపురం, డిసెంబరు 12: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలో గురువారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాలగోని మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో రాష్ట్ర పర్యాటక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణ రావు, బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. వందలాది స్వాముల సంకీర్తనలు, అయ్యప్ప స్వామి నామస్మరణతో ఈదులనాగులపల్లి మారుమోగింది. కార్యక్రమంలో నేతలు రాజు గౌడ్, మయూరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి ట్రెజరీ అధికారికి పదోన్నతి

ఇన్‌చార్జిగా సత్యసోమేశ్వరరావు

మెదక్ అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా ఖజానా శాఖాధికారి సాయిలుకు పదోన్నతి లభించింది. 2021 నుంచి జిల్లాలో పని చేసిన ఆయన గురువారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల హైదారాబాద్ అసిస్టెంట్ సెక్రటరీ ఫైనాన్స్ అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నర్సాపూర్‌లో పని చేస్తున్న డీటీవో సత్యసోమేశ్వరరావు ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న సాయిలు కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగ నిర్వహణలో సాయిలు క్రమశిక్షణకు ప్రతిరూపమని కలెక్టర్ కొనియాడారు.



కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు పూలమొక్కను అందజేస్తున్న సాయిలు

అనుమానితులపై నిఘా ఉంచాలి

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనుమానితులు, కేడీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సంగారెడ్డి ఎస్పీ సీహెచ్ రూపేష్ ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా సంగారెడ్డి డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీకి పలు సూచనలు చేశారు. దర్యాప్తులో మెలకువలను నిరంతరం ఎస్‌హెచ్‌వోలకు తెలియజేయాలన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూ ఛేదనలకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. వరకట్న మరణాల కేసులు, ఎస్సీఎస్టీ వంటి సున్నితమైన కేసులను విచారణ సమయంలో నూతన చట్టాలను అనుసరించాలన్నారు. నిజమైన నేరస్తులకు శిక్ష పడే విధంగా చూడాలన్నారు. జిల్లా కేంద్రంలో వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుందని, ట్రాఫిక్ నిబంధనలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాహన తనిఖీలు, నాకాబందీ వంటి స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం నేరాలను నియంత్రణకు చొరవ చూపాలన్నారు. జిల్లాలో నిషేధిత గుట్కా, పాన్ మసాలా, సిగరెట్ అమ్మకాలు, అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. జిల్లా సరిహద్దుల్లో, హైవేలపై హై రెసెల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల ప్రాధాన్యత పట్టణ ప్రజలకు వివరించాలని ఎస్పీ తెలిపారు. డీఎస్పీ సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రూపేష్

క్రైం కార్నర్

గంజాయి కేసులో పురోగతి

● ముఠాలోని ఒకరి అరెస్ట్

రామాయంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట బైపా‌స్‌లో అక్టోబరు 19న కారు బోల్తా పడి గంజాయి బయటపడ్డ కేసులో పురోగతి లభించింది. ఈ ఘటనలో 88 కేజీల గంజాయి పట్టుబడగా.. నిందితులు పరారీలో ఉన్నారు. ఈ మేరకు దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు ఉత్తర ప్రదేశ్ నోయిడా రాష్ట్రానికి చెందిన అమిత్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా... మరికొందరి నిందితుల పేర్లు బయటపెట్టాడు. అనతరం అతడిని మెదక్ కోర్టులో హాజరపరిచి కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరాజా గౌడ్ గురువారం తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి.. రూ.80 వేలు చోరీ

రామాయంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో డబ్బుల డ్రా కోసం వెళ్లిన వ్యక్తిని మోసం చేసి రూ.80 వేలు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. రామయంపేట పట్టణానికి చెందిన శ్రీశైలం ఈ నెల 5న డబ్బులు డ్రా చేసేందుకు సిద్దిపేట చౌరస్తాలోని ఏటీఎంకు వెళ్లి అక్కడే ఉన్న ఓ వ్యక్తిని డ్రా చేయాలని కోరాడు. కొంత నగదు డ్రా చేసి ఇచ్చిన దుండగుడు మరోసారి ప్రయత్నించి రావటం లేదని.. శ్రీశైలం దృష్టి మరల్చి తన జేబులోని మరో ఏటీఎం కార్డును ఇచ్చాడు. రెండు రోజుల వ్యవధిలో రూ.40 వేల చొప్పున రెండుసార్లు డ్రా చేసుకున్నాడు. ఇది గమనించని శ్రీశైలం గురువారం బ్యాంకులో డబ్బుల డ్రా కోసం వెళ్లగా అసలు విషయం బయటపడటంతో పోలీసులను ఆశ్రయించాడు.

గుమ్మడిదలలో మరోసారి రెచ్చిపోయిన దొంగలు

● బంగారం, నగదు చోరీ

గుమ్మడిదల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల గ్రామంలో మరోసారి దొంగలు రెచ్చిపోయారు. కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి ఇంట్లో పట్టపగలే చొరబడి బంగారం, నగదును దోచుకెళ్లిన దొంగలు.. బుధవారం మరోసారి చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మడిదల గ్రామానికి చెందిన పోచుగారి పాపిరెడ్డి బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల పెళ్లికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దండగులు పట్టపగలే ఇంట్లోకి చొరబడి తొమ్మిదిన్నర తులాల బంగాం, రూ 90 వేలు తస్కరించారు. అనంతరం గోనె మధుసూదన్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించడంతో గమనించి ఇంటి యజమాని అరవడంతో అక్కడి నుంచి పరారయ్యారు. బుధవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన పాపిరెడ్డిని దొంగతనం జరగడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి గురువారం తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



నర్సింహులు (ఫైల్)

తూప్రాన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన తూప్రాన్ మండలం మల్కాపూర్‌లో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పల్లపు వడ్డె నర్సింహులు(48) రాతిపని చేస్తూ జీవిస్తున్నాడు. కొన్నిరోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. కొంతసేపటికి సోదరుడికి ఫోన్ చేసి తన కూతురిని జాగ్రత్తగా చూసుకోడంటూ చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ తరువాత కాల్ చేసినా లిఫ్ట చేయలేదు. వెతికినప్పటికీ ఆచూకీ లభించలేకపోవడంతో సోదరుడు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

కూరగాయల హబ్.. ఏమాయే..!

వంటిమామిడి మార్కెట్ విస్తరణకు గ్రహణం

● ఆగమేఘాలపై భూసేకరణ.. తరువాత నిర్లక్ష్యం ● మూడేళ్లుగా ముందుకు సాగని పనులు

వంటిమామిడి కూరగాయల మార్కెట్ విస్తరణ పనులు అటకెక్కాయి. గతం ప్రభుత్వం దీన్ని కూరగాయల హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఆగమేఘాల మీద భూసేకరణ చేసి ఆ తరువాత పట్టించుకోలేదు. మూడేళ్లుగా కూరగాయల హబ్ పనులు పడకేశాయి. మార్కెట్ విస్తరణతో మేలు జరుగుతుందని భావించిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో కూరగాయల హబ్ ఏర్పాటుపై ముందడుగు వేస్తుందా? లేదా అన్న సందిగ్ధం రైతుల్లో నెలకొన్నది.



వంటిమామిడి మార్కెట్ కార్యాలయం

ములుగు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు దశాబ్దాల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ములుగు మండలం వంటిమామిడి వద్ద కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసింది. గజ్వేల్ మార్కెట్ నుంచి వేరుచేస్తూ నూతనంగా దీన్ని నిర్మించింది. దీంతో పరిసర గ్రామాల్లో కూరగాయల సాగు పెరిగిపోయింది. స్థానికులే కాకుండా, తదితర ప్రాంతాల నుంచి రైతులు కూరగాయలను వంటిమామిడి మార్కెట్‌కు తీసుకొస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో పెద్ద మార్కెట్‌గా అవతరించింది. గజ్వేల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గత సీఎం కేసీఆర్ హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఈ మార్కెట్‌ను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. అక్కడి రద్దీని గమనించిన ఆయన వంటిమామిడి మార్కెట్‌ను మరింత విస్తరించి కూరగాయల హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అప్పట్లో కలెక్టర్, మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు 56 ఎకరాల అసైన్డ్ భూమి సేకరించి మార్కెటింగ్‌శాఖకు అప్పగించారు. నిర్వాసితులకు ఎకరాకు రూ.8.50 లక్షలు, ప్లాట్ చొప్పున పరిహారం ఇచ్చేందుకు నిర్ణయించిన సర్కార్ కేవలం నగదు మాత్రమే అందజేసింది.

విస్తరిస్తే మరింత ఆదాయం..

ఈ కూరగాయల హబ్ ఏర్పాటుతో హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాలు, పక్కనున్న మహరాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు కూరగాయల ఎగుమతి చేసే అవకాశం ఉంటుందని అధికారులు రైతులకు భరోసా కల్పించారు. ఇప్పటికే కూరగాయల మార్కెట్‌లో 123 కాంటాలు ఏర్పాటు చేయడంతో నెలకు రూ.9 లక్షల ఆదాయంగా



కూరగాయల హబ్‌కు సేకరించిన భూమి

యేడాదికి రూ.1.08 కోట్ల ఆదాయం వస్తున్నది. ఇక హబ్ ఏర్పాటుతో మరింత ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇక కొనుగోళ్లు బాగా జరిగి రైతులకూ మేలు జరగనున్నది. రీజినల్ రింగ్ రోడ్డుకు సమీపంలో కూరగాయల హబ్ ఏర్పాటయితే ఇతర రాష్ట్రాలు, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు సులువుగా తక్కువ ధరకు అందజేయవచ్చని భావించారు. భూసేకరణ పూర్తయినా ఏర్పాటుపై శ్రద్ధ చూపకపోవడంతో పనులు పడకేశాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడంతో వంటిమామిడిలో కూరగాయల హబ్ ఏర్పాటవుతుందా.. లేదా అన్న సందేహం స్థానికుల్లో నెలకొన్నది.

ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకోవాలి..



వంటిమామిడిలో కూరగాయల హబ్ ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. హబ్‌తో మంచి ధర లభించడంతోపాటు, ఎక్కువ మొత్తంలో కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతాయి. ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకొని హబ్ ఏర్పాటు చేయాలి.

- బూరుగుపల్లి పోచయ్య

హబ్ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి



కూరగాయల హబ్ ఏర్పాటు చేసి వ్యాపారం పెంచాలి. భూసేకరణ చేసి హబ్ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకొని రైతులకు మేలు జరిగే విధంగా చూడాలి. హబ్ ఏర్పాటుతో పలువురికి ఉపాధి లభిస్తుంది.

- తీగుళ్ల కుమార్, కమిషన్ ఏజెంట్

మెదక్ చర్చి అభివృద్ధికి రూ.29.18 కోట్లు

● టూరిజం స్పాట్‌గా అక్కన్నపేట అటవీ ప్రాంతం

● ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ అర్బన్/రామాయంపేట, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ది చర్చిగా పేరొందిన మెదక్ సీఎస్ఐ మహా దేవాలయాభివృద్ధికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.29.18 కోట్లు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే రోహిత్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని అవుసులపల్లిలో రూ.24 లక్షలతో నిర్మించిన అటవీ శాఖ వన సంరక్షణ నివాస గృహాలను ఆయన ప్రారంభించారు. అలాగే రామాయంపేట మండలం అక్కన్నపేట ఫారెస్టులో అర్బన్‌పార్క్ ఏర్పాటుకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కన్నపేట జడ్పీహెచ్ఎస్ సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక నిధులతో చర్చి సుందరీకరణ చేపడుతామన్నారు. భక్తుల సౌకర్యార్థం రూ.24.50 కోట్లతో వసతి గృహాల నిర్మాణం, చర్చి పరిసరాల్లో రూ.2.55 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి కోసం రూ.1.50 కోట్లు, రూ.45 లక్షలతో ఏసుక్రీస్తు విగ్రహం, రూ.18 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఏడుపాయల వన దుర్గమాత, పోచారం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు చెప్పారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండాసురేఖ, జిల్లా మంత్రి దామోదర రాజనరసింహకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మెదక్ అభయారణ్యం తోపాటుగా అక్కన్నపేట అటవీ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో డీఎఫ్‌వో జోజి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఫారెస్ట్ రేంజర్ విద్యాసాగర్, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు యుగంధర్, నాయకులు చింతల స్వామి, అల్లాడి వెంకటేష్, రవి, హనుమంతరావు, నాగులు తదితరులు పాల్గొన్నారు.



అటవీశాఖ వన సంరక్షణ నివాస గృహాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

గీతం పూర్వ విద్యార్థికి అరుదైన గౌరవం

● ప్రపంచ సదస్సులో వక్తగా, న్యాయ నిర్ణేతగా అవకాశం

● గ్లోబల్ ఐకాన్ అవార్డుతో సత్కారం

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 12 : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ పూర్వ విద్యార్థి, ప్రస్తుతం అమెజాన్ రోబోటిక్స్‌లో సిస్టమ్స్ డెవలప్ మెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అనూజ్ సురావ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 6నుంచి 12వ తేదీ వరకు అమెరికా, కేంబ్రిడ్జ్‌లోని హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ పరిశోధనా సదస్సు (గ్లోబల్ రీసెర్చ్ కాన్ఫరెన్స్ 2024లో వక్తగా, న్యాయనిర్ణేతగా)లో పాల్గొన్నారు. బెంగళూరుకు చెందిన గ్లోబల్ ఎకనామిక్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ హరికృష్ణ మారం నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో రోబోటిక్స్ క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేథ రంగాలకు అనూజ్ చేసిన సేవలను గుర్తిస్తూ 'గ్లోబల్ ఐకాన్ అవార్డు'తో సత్కరించారు. అమెరికా అంకుర సంస్థల నిపుణుడు, వక్త, మార్గదర్శి, వ్యవస్థాపకుడు బారన్ అలెక్సెరస్ చేతుల మీదుగా ఈ సత్కారాన్ని అందుకోవడం విశేషం. 'అడాప్టివ్ ఇంటర్ ఫేస్‌తో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్, కృత్రిమ మేథ ఆధారిత ఆటోమేటెడ్ రోబోటిక్ సిస్టమ్'పై అనూజ్ సంచలనాత్మక పరిశోధనా పత్రం సమర్పించారు. అంతేగాక తన పరిశోధనాంశాలను అక్కడ ప్రదర్శించడమే గాక, వినూత్న పరిశోధనా పత్రాల ఎంపికలో న్యాయ నిర్ణేతగా కూడా వ్యవహరించారు. అత్యాధునిక కృత్రిమ మేథస్సు, అడాప్టివ్ ఇంటర్ ఫేస్‌ల ఏకీకరణను ప్రస్ఫుటించేలా అనూజ్ అధునాతన రోబోటిక్ సిస్టమ్‌లను చూసేందుకు సదస్సుకు హాజరైన వారికి వీలుకల్పించారు. సంకల్ప్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సామాజిక సేవ, అనాథలను ఆదుకోవడమే గాక, గీతం విద్యార్థిగా ప్రఖ్యాత ఐటీసీ సంస్థ నుంచి పర్యావరణ పరిరక్షణకు గాను నేషనల్ గ్రీన్ లీడర్ అవార్డును అనూజ్ అందుకున్నారు. ఆ తరువాత న్యూయార్క్ విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో ఎంఎస్ చేసి, అమెరికాలోనే స్థిరపడ్డారు. ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో గుర్తింపు తెచ్చుకున్న అనూజ్ గీతంలోని ఉన్నత విద్య, విలువల నాణ్యతకు నిదర్శనంగా నిలిచారు.



గ్లోబల్ ఐకాన్ అవార్డుతో అనూజ్ సురావ్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

● తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృత్యువాత

● చేగుంట పట్టణంలో దంపతులను ఢీకొట్టిన డీసీఎం

● భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు

● జగదేవ్‌పూర్, మిరుదొడ్డిలో ఒక్కొక్కరు దుర్మరణం



పోచయ్య మృతదేహం

చేగుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామానికి చెందిన గౌడి పోచయ్య(64) తన భార్య వజ్రమ్మతో కలిసి ద్విచక్రవాహనంపై గురువారం నార్సింగి ఆసుపత్రిలో ఉన్న బంధువులను పరామర్శించేందుకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. చేగుంట పట్టణంలో వడియారం నుంచి చేగుంట వైపు వస్తున్న డీసీఎం బలం వారిని ఢీ కొనడంతో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా పోచయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి..

జగదేవ్‌పూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీ కొట్టడంతో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధముల మధిర గ్రామం భీమరిగుడెంకు చెందిన పిట్టల వెంకటయ్య(50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో జగదేవ్‌పూర్ గాంధీ విగ్రహం వద్ద రోడ్డు దాటుతుండగా భువనగిరి నుంచి గజ్వేల్ వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన వెంకటయ్యను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

మిరుదొడ్డి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన మిరుదొడ్డిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి గ్రామానికి చెందిన కుమ్మరి రాజు(28) లింగుపల్లి వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కడుపునొప్పితో వృద్ధుడి ఆత్మహత్య



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గజ్వేల్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడుప నొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్లలో గురువారం చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తిప్పారం పెంటయ్య(75) సంవత్సరం నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి కడుపునొప్పి అధికంగా రావడంతో భరించలేక తన పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళలపై దాడులను అరికట్టాలి : ఐద్వా



సెమినార్‌లో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత

గజ్వేల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులను అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో గురువారం నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు, గృహ హింస రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని నియంత్రించడంలో పాలకులు విఫలమవుతున్నారన్నారు. మోదీ ప్రభుత్వం మహిళల హక్కులను హరిస్తుందన్నారు. మనుధర్మ శాస్త్రం అమలు జరిపి మహిళలను వంటింటికి పరిమితం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. మహిళలపై దాడుల కేసులకు సంబంధించి ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అత్తిని శారద, జిల్లా కమిటీ సభ్యులు సందబోయిన రాణి పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లపై సమావేశాలు

వెల్దుర్తి/నారాయణఖేడ్ /జోగిపేట డిసెంబరు12(ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తిలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు విషయమై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇక్కడ కొందరు మాత్రమే హాజరయ్యారు. ఖేడ్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. వివిధ పార్టీల ప్రతినిధులు హాజరు కాగా వారి సూచనలు, సలహాలను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి స్వీకరించారు. జోగిపేట ఎంపీడీవో రాజేశ్ తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించి మార్పులు చేర్పులు అవసరమా అన్న విషయాలపై తమకు తెలియజేయాలని ఆయన సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు అన్విత



అన్వితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

మద్దూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గుండె అన్విత జాతీయ స్థాయికి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అందె గణేష్ గురువారం తెలిపారు. గత నెలలో తుక్కుగూడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చినట్లు తెలిపారు. ఈ నెల 17 వరకు పంజాబ్ రాష్ట్రంలోని లుధియానాలో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలలో ఆమె పాల్గొంటుందన్నారు. అన్వితను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందం, పీడీ ప్రేమ్‌కుమార్ అభినందించారు.



రైతు కనుకయ్య ఏర్పాటు చేసిన చేపల చెరువు



చేపల చెరువు దగ్గర ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

వ్యవసాయం చేస్తూనే.. చేపల పెంపకం

● ఆదర్శం రైతు కనకయ్య

అక్కన్నపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన కాశవేని కనకయ్యకు నాలుగున్నర ఎకరాల భూమి ఉంది. పలు రకాల పంటలు సాగు చేస్తూనే వినూత్నంగా ఆలోచించి చేపల పెంపకంపై దృష్టి సారించారు. నాలుగేళ్ల క్రితం 20 గుంటల భూమిలో చేపల చెరువును తవ్వించి జనగామ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి 6వేల చేపపిల్లలు తీసుకువచ్చి వదిలాడు. బొచ్చ, రవ్వ, మెరిగే, గ్యాస్ కిట్, బంగారుతీగ, బొమ్మెలు పెంచుతున్నాడు. ఐదు నుంచి ఆరు నెలల్లో ఒక్కొక్క చేప కిలో నుంచి రెండున్నర కిలోల వరకు బరువు పెరుగుతుంది. చేపల పెంపకంలో కూలీల అవసరం ఎక్కువగా ఉండదు. తానొక్కడే ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా చేపలకు ఆహారాన్ని అందిస్తాడు. చేపలు పట్టే సమయంలో మాత్రమే కూలీలు అవసరం పడతారు. చేపలకు ఆహారంగా తవుడు, గానుగ పిండి, సేంద్రియ ఎరువు వేస్తాడు. ప్రతి వారం రోజులకు ఒకసారి చెరువులో నుండి పాత నీరు తీసివేసి కొత్తనీరు నింపుతాడు. 7 నెలలకోసారి క్రాప్ వస్తుండగా.. ప్రతి క్రాపునకు రూ, 70 వేల నుంచి రూ, 80 వేల ఆదాయం వస్తుంది. చేపల చెరువుకు కాపలాగా సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకొని సెల్‌ఫోన్‌కు అను సంధానం చేసుకున్నాడు. నాలుగు సంవత్సరాల నుంచి చేపల పెంపకంలో లాభాలు గడిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఈ నెల15 వరకు పత్తి మిల్లులు బంద్

నారాయణఖేడ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఉన్న 8పత్తి(జిన్నింగ్) మిల్లులు శుక్రవారం నుంచి ఈనెల 15 వరకు మూడు రోజుల పాటు మూసి ఉంటాయని ఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వీరేశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 నుంచి యథావిధిగా తెరిచిఉంటాయన్నారు.

రేపు హ్యాండ్‌బాల్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న సంగారెడ్డిలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ విజయ్‌బాబు, జాయింట్ సెక్రటరీ మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ వెంట బోనఫైడ్, టెన్త్ మెమో, టీసీ, ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు. క్రీడాకారులు జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 27 నుంచి 30 వ తేదీ వరకు గచ్చిబౌలి స్టేడియంలో జరిగే ఎంపికల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 9849951217, 7780333109 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువును ఈ నెల 16 వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్ణీత అపరాధ రుసుముతో గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8008403635 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇళ్ల మధ్యనే మురుగు పరుగు

- జహీరాబాద్ పట్టణంలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- పలు కాలనీల్లో మురుగునీరు బయటకు వెళ్లేదారి లేక ఇక్కట్లు
- పారిశుధ్య లోపంతో ప్రజలకు తిప్పలు




జహీరాబాద్‌లోని ఆర్టీసీ కాలనీలో ఇళ్ల మధ్యనే మురుగునీటి గుంత, దత్తగిరికాలనీ పార్కులో మురుగునీరు

జహీరాబాద్ డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణం అంతకంతకూ విస్తరిస్తూ కొత్త కాలనీలు పుట్టుకొస్తున్నాయి. కాలనీల ఏర్పాటు సమయంలో వెంచర్ల నిర్వాహకులు అవసరాలకు తగినట్టుగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం ఓ కారణం కాగా, మరికొన్ని వెంచర్లలో డ్రైనేజీ నీరు బయటకు వెళ్లడానికి వీలుగా ఏర్పాట్లు లేకపోవడం గమనార్హం. మరోవైపు చిన్నవిగా ఉన్న డ్రైనేజీల్లో చెత్తా చెదారం పేరుకుపోవడం తదితర సమస్యలు నెలకొన్నాయి. దీంతో మురుగునీరంతా ఇళ్ల మధ్య గుంతల ప్రదేశాల్లో చేరి పట్టణ ప్రజలకు నిత్యం తిప్పలు తప్పడం లేదు. మురుగునీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నప్పటికీ డ్రైనేజీ సమస్యకు శాశ్వతపరిష్కారం లభించడం లేదని స్థానికులు వాపోతున్నారు. జహీరాబాద్ పట్టణం సుమారు 65కిలోమీటర్లు విస్తరించి ఉంది. 375 కిలోమీటర్ల మేర డ్రైనేజీలున్నాయి.

కాలనీల్లో పేరుకుపోతున్న మురుగునీరు

జహీరాబాద్ పట్టణంలో 37వార్డులుండగా ప్రధానంగా 10 వార్డుల్లో అక్కడక్కడా మురుగు నీరు ఇళ్లమధ్యలో చేరుతోంది. మహీంద్రకాలనీ, ఆర్టీసీకాలనీ, రంజోల్, అల్లీపూర్, గడీ, గాంధీనగర్, పస్తాపూర్ తదితర ప్రాంతాల్లోని ఇళ్ల మధ్యన మురుగునీటి గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఇళ్లలోకి ముక్కుపుటాలదిరేలా దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు, ఈగలు వృద్ధి చెందిన స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అంచనాలకు మించి మురుగు నీరు

పట్టణ జనాభా లక్ష పై చిలుకు ఉండగా అధికారికంగా ప్రజలకు రోజుకు 12వేల కిలోలీటర్ల నీరు అవసరం. సుమారు 10 కిలోలీటర్ల మురుగు నీరు మురుగు కాలువల ద్వారా బయటకు పోతున్నట్టు అధికారిక అంచనాలు. అయితే అనధికారికంగామాత్రం సుమారు 20వేల కిలోలీటర్ల నీటిని వినియోగిస్తున్నారు. 15వేల పై చిలుకు కిలోలీటర్ల నీరు బయటకు పోతోంది. అందుకు సరిపోయే పరిమాణంలో డ్రైనేజీలు లేక మురుగునీరు పెద్దమొత్తంలో ప్రవహిస్తూ పట్టణంలోని పలుప్రాంతాల్లో రోడ్లపైన, ఇళ్లమధ్యలో మురుగునీటి గుంతలు ఏర్పడుతున్నాయి. మున్సిపల్ అధికారులు ఏమిచేయలేని పరిస్థితి నెలకొన్నది. మురుగు నీరు ముందుకు పోవడానికి వీలుగా తాత్కాలిక కాలువలు తవ్విస్తున్నాపలితం లేకుండా పోతుందని ఆయా వార్డుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.90 కోట్లతో డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు!

పట్టణంలో 190 కిలోమీటర్లు సీసీడ్రైన్‌లు, 185 కిలోమీటర్లు కచ్చాడ్రైన్‌లు ఉన్నాయి. అయితే మున్సిపల్ అధికారులు పట్టణంలో కొత్తగా 7కిలోమీటర్ల మేర డ్రైనేజీలు అవసరమని, అందుకు ఇటీవల రూ.90 కోట్ల నిధులు కావాలంటూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఏది ఏమైనప్పటికీ మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా వార్డులకు చెందిన ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ విషయమై సంబంధిత మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా.. పలు కాలనీలకు సంబంధించి మురుగునీటి సమస్య తమ దృష్టికి వచ్చిందని ఆయా కాలనీల్లో పర్యటించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మురుగు నీటితో నిత్యం ఇబ్బందులే



మురుగునీటితో ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నం. పలుమార్లు అధికారులకు, నాయకులకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోతున్నది. ఇళ్ల మధ్యన మురుగు నీరు చేరడంతో ఎంతో మంది వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. మురుగునీటిని డ్రైనేజీలద్వారా బయటకు వెళ్లేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రమేష్, మహీంద్రకాలనీ-జహీరాబాద్

రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో పడిఉన్న క్షతగాత్రులు

కౌడిపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని తునికిగేట్ సమీపంలో గురువారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. రాయిలాపూర్ తండాకు చెందిన ముడావత్ శ్రీకాంత్, తల్లి లక్ష్మి, భార్య చిట్టితో కలసి తన బైక్‌పై నర్సాపూర్ నుంచి తండాకు బయలుదేరాడు. ఈ క్రమంలో తునికిగేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో శ్రీకాంత్‌తో పాటు భార్య చిట్టికి స్వల్ప గాయాలు కాగా తల్లి లక్ష్మికి కాలు విరిగింది. బాధితులను 108వాహనంలో నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు.

తాళం వేసి ఇంట్లో చోరీ

శివ్వంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోమారం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గురువారం చోరీ జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గోమారం గ్రామానికి చెందిన బొల్లారం పోచయ్య ఈ నెల 10న సాయంత్రం ఇంటికి తాళం వేసి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్నాయని పక్కింటివారు సమాచారం ఇవ్వడంతో పోచయ్య వెంటనే ఆసుపత్రి నుంచి వచ్చి ఇంట్లో పరిశీలించగా ధ్వంసమైన బీరువానుంచి పావు తులం బంగారం, 8 తులాల వెండి, రూ.30 వేల నగదు అపహరించుకు పోయినట్టు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు క్లూస్‌టీమ్‌తో పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధూకర్ రెడ్డి తెలిపారు.

సిర్గాపూర్‌లో పాత నేరస్థులకు కౌన్సెలింగ్

కల్హేర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పలు దొంగతనాలకు సంబంధించి కేసుల్లో నిందితులుగా ఉన్న నలుగురు వ్యక్తులు ఇటీవల బెయిల్‌పై విడుదల కాగా వారికి గురువారం సిర్గాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ వెంకటరెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. సిర్గాపూర్ మండల పరిధిలోని వాసర్ బీబ్యానాయక్ తండాకు చెందిన జాదవ్ జయరాం, బలరాం, పుండ్లిక్, రాథోడ్ నగేష్ అనే వ్యక్తులపై ఒక్కొక్కరి మీద 35 దొంగతనం కేసులు నమోదై శిక్ష పడగా ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యారని ఎస్‌ఐ తెలిపారు. జైలు జీవితం గుణపాఠంగా నేర్చుకుని మంచిగా జీవించాలని ఎస్‌ఐ వారికి సూచించారు. మళ్లీ నేరాలకు పాల్పడితే శిక్షలు మరింత కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు బాధితులకు అందజేత

పెద్దశంకరంపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన సీహెచ్.ప్రవీణ్, క్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసిన పోలీసులు పోగొట్టుకున్న ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు గురువారం అప్పగించారు.

ఎల్‌సీడీసీ సర్వే పరిశీలన

తూప్రాన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న ఎల్‌సీడీసీ ఇంటింటి సర్వేను ఎల్‌సీడీసీ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ సరస్వతి పరిశీలించారు. గురువారం తూప్రాన్‌లో జరుగుతున్న సర్వే తీరును ఆమె పరిశీలించారు. బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ)తో కుష్టివ్యాధిని నయం చేయవచ్చని, మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లభిస్తాయని ఆమె తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సమత, సీహెచ్‌వో బాలనర్సయ్య, డీఎంవో సంతోష్‌కుమార్, సూపర్‌వైజర్ కృష్ణ, శారద పాల్గొన్నారు.

'సీఎంను విమర్శించే హక్కు హరీశ్‌రావుకు లేదు'

పటాన్‌చెరు, డిసెంబరు, 12(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు మాజీ మంత్రి హరీశ్‌రావుకు లేదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, పటాన్‌చెరు కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి విమర్శించారు. గురువారం పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణా ద్రోహి అని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన విమర్శలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మతిన్, సంజీవరెడ్డి, అతిక్, పాషా, యువరాజ్, సాయిముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి సేవా దృక్పథం కలిగి ఉండాలి



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్

కోహీర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉన్నప్పుడే సమాజానికి మేలు జరుగుతుందని మాజీమంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పీచేర్యాగడి తండా, సజ్జాపూర్, మాచిరెడ్డిపల్లి గ్రామాల్లో స్వచ్ఛంద సేవ వ్యవస్థాపకుడు ప్రసాద్‌రెడ్డి 80 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయగా, కార్యక్రమంలో మాజీ మంత్రి పాల్గొని మాట్లాడారు. పీచేర్యాగడి తండాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీమంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ తండా అభివృద్ధికి ప్రసాద్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. కొత్తూరు (కె) గ్రామంలో అండర్ డ్రైనేజ్ సిస్టం ఏర్పాటు కొరకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కోహీర్ ఎస్‌ఐ సతీష్, టీజీఐడీసీ చైర్మన్ తన్వీర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి ముల్తాని, నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్‌బీఐ నివేదికతో కేసీఆర్ పాలన సుభిక్షమని తేలింది

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఐ ఇచ్చిన నివేదికలో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కేసీఆర్ పాలనలో ఆర్థికంగా ఎంత సుభిక్షంగా ఉందో తేలిందని ఇకనైనా కాంగ్రెస్ నాయకులు తమ వైఖరి మార్చుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హితవు పలికారు. గురువారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌బీఐ ఇచ్చిన నివేదికలో రాష్ట్రం కేసీఆర్ పాలన సమయంలో ఆర్థికంగా పురోగతి చెందడమే కాకుండా వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల, అటవీసంపద పెరుగు, నిరంతర విద్యుత్, ఉపాధిఅవకాశాలు తదితర వాటిలో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ విషయం ఆర్‌బీఐ ఇచ్చిన నివేదికలోనే తేలిందని అన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నయిమోద్దిన్, శివ్వంపేట మాజీ ఎంపీపీ హరికృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విపత్తుల నివారణపై విద్యార్థులకు అవగాహన



విపత్తులపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్

వెల్దుర్తి, డిసెంబరు 12(ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని కుకునూర్ ఉన్నత పాఠశాలలో గురువారం విపత్తుల నివారణపై హైదరాబాద్ షేక్‌పేట వద్ద గల 10వ బెటాలియన్‌కు చెందిన జాతీయ విపత్తుల దళం ప్రతిస్పందన దళం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్లు గౌతంకుమార్, గౌరవ్ యాదవ్‌లు విపత్తులు జరిగినప్పుడు అందుబాటులో ఉన్న వస్తువులను తమ రక్షణ కోసం ఎలా వాడుకోవాలనే అంశాలపై ప్రదర్శన ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఇందిరమ్మ గృహాల దరఖాస్తుల పరిశీలన ప్రారంభం

జిన్నారం/కౌడిపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో ఇందిరమ్మ నివాసాల కోసం చేసుకున్న దరఖాస్తులను మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ పరిశీలన చేశారు. గురువారం బొల్లారం మున్సిపాలిటీలో చైర్ పర్సన్ రోజారాణి, కమిషనర్ మంగతాయారు, ఆర్వో నర్సింలు, ఇతర సిబ్బంది దరఖాస్తుల పరిశీలన కోసం పలు కాలనీలలో పర్యటించారు. కాగా మెదక్‌జిల్లా కౌడిపల్లి మండలంలోని ధర్మసాగర్‌లో ఇందిరమ్మ కమిటీ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన కార్యకర్తల ఇళ్లను సర్వే చేస్తున్నారంటూ మాజీ సర్పంచ్ ఆశమ్మ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సర్వేను అడ్డుకున్నారు.

అట్టహాసంగా సీఎం కప్ మండలస్థాయి క్రీడల ముగింపు




రామాయంపేటలో గెలిచిన క్రీడాకారులకు బహుమతి ప్రదానం, నర్సాపూర్‌లో విజేతజట్టుకు కప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి



పటాన్‌చెరు: మైత్రీ మినీ స్టేడియంలో బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే



జోగిపేట: విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న మున్సిపల్ పాలకవర్గం

న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

ఈ నెల 10న ప్రారంభమైన సీఎంకప్ మండలస్థాయి క్రీడాపోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాల్లో పోటీల ముగింపు కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. సీఎంకప్ క్రీడలతో గ్రామీణ క్రీడాకారుల్లోని దాగిఉన్న నైపుణ్యం వెలుగులోకి వస్తుందని తెలిపారు. పటాన్‌చెరు మైత్రీ మినీ స్టేడియంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సీఎంకప్ క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. హవేళీఘణపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సీఎంకప్ ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొని విజేతలకు బహుమతులు పంపిణి చేశారు. నర్సాపూర్‌లో నిర్వహించిన క్రీడల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ టోల్‌ప్లాజా గురుకులంలో నిర్వహించిన క్రీడల్లో విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి బహుమతుల ప్రదానం చేశారు.

ఒకేషనల్ విద్యతో విద్యార్థులకు ఉపాధి

చిన్నశంకరంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ విద్యతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఉంటాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని డీసీసీ బ్యాంకు కార్యాలయంలో ఎస్‌బీఐ, ఆంధ్రాబ్యాంక్, డీసీసీపీ బ్యాంక్ సేవలపై బ్యాంకు మేనేజర్లు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శశిధర్ మాట్లాడుతూ టెక్నికల్ సర్టిఫికెట్‌తో నైపుణ్య ఉద్యోగాలు సకాలంలో పొందుతారన్నారు.

యాసంగి పంటపై అవగాహన కల్పించాలి

నారాయణఖేడ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో సైతం రైతులు సన్నరకం వరిని పండించే విధంగా త్వరగా నాట్లు వేసుకొని ఏప్రిల్ 15 లోగా పంట కోతలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించడంలో చొరవ తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి గురువారం పంపిన లేఖలో కోరారు.

పుత్తడిబొమ్మకు పెళ్లి సంకెళ్లు

(5వ పేజీ తరువాయి)

వివాహం జరిపిస్తే ఇరువురి కుటుంబీకులకు రెండేళ్ల పాటు జైలు శిక్షను కూడా అమలు చేస్తోంది. గ్రామస్థాయిలో విఆర్వో, మండల స్థాయిలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, తహసీల్దార్, ఎంపీడీవో, మూడు మండలాలకు ప్రాజెక్టు స్థాయిలో సీడీపీవో, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, జిల్లా స్థాయిలో కలెక్టర్‌లు బాల్య వివాహాల నిరోధక అధికారులుగా వుంటారు. బాలికకు పెళ్లి జరిపిస్తే పెళ్లి కుమారుడితో పాటు ఇరువర్గాల తల్లిదండ్రులు, వివాహం చేసిన పురోహితులు, ఇరువర్గాల పెద్దలు, బంధువులు, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, పెళ్లికి సామగ్రి సరఫరా చేసిన టెంట్‌హౌజ్ నిర్వాహకులు, భాజాబజంత్రీల వారిపై కూడా కేసులు నమోదు చేసే అవకాశం వుంది. బాల్య వివాహం జరిపించిన రెండేళ్ల తర్వాత కూడా కేసులు నమోదు చేసే అవకాశం వుంది. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే 1098, 100,108 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు.

అనర్థాలెన్నో!

చదువుకుంటూ ఆటపాటలతో ఎదగాల్సిన బాలికలకు బాల్య వివాహాలు జరిపిస్తే మానసికంగా, శారీరకంగా తీవ్రంగా నష్టం జరిగే అవకాశం ఉంది. చిన్న వయస్సులోనే సంసార బాధ్యతలు మోయడం వల్ల కుటుంబ కలహాలు, లైంగిక సమస్యలు ఎదురవుతాయి. బాలికల గర్భాశయం పరిణతి చెందకపోవడంతో బిడ్డకు జన్మనివ్వడం కష్టమవుతుంది. ఒకవేళ జన్మనిచ్చినా తగినంత బరువు లేకపోవడం, తక్కువ నెలలకే కాన్పు కావడం వంటివి సంభవిస్తాయి. దీంతో తల్లీబిడ్డ ప్రాణాలకే ప్రమాదం వుంటుంది. అంతేగాక మానసిక పరిపక్వత లేని కారణంగా వరకట్నంతో పాటు, అత్తామామల వేధింపులు, ఆర్థిక సమస్యలు తలెత్తినప్పుడు క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం కూడా వుంటుంది.

అభివృద్ధి సగమే!

(5వ పేజీ తరువాయి)

అన్న చందంలా ఆగిపోయాయి. రూ.6.50 కోట్లతో నిర్మిస్తున్న వెజ్-నాన్‌వెజ్ సమీకృత భవన సముదాయం పనులను నిధుల కొరతతో అర్థాంతరంగా నిలిపివేశారు.

చిల్డ్రన్‌పార్కు.. ఆడిటోరియంను ప్రారంభించరా?

2019లో టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా పట్టణానికి రూ.17.95 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో అధికారులు రూ.2.75 కోట్లతో వైకుంఠధామాలు నిర్మించారు. రూ.2 కోట్లతో చిల్డ్రన్‌పార్కు, రూ.5 కోట్లతో పట్టణంలో 65వ జాతీయ రహదారిపై సెంట్రల్ మీడియన్, రూ.30 లక్షలతో స్మృతివనం, రూ.50 లక్షలతో పట్టణంలో వికారాబాద్ రోడ్డు మార్గంలో సెంట్రల్ లైటింగ్, రూ.కోటితో ఆడిటోరియం, రూ.6.50 కోట్లతో పట్టణంలోని సిద్ధాపూర్ కాలనీకి కొత్తగా డబుల్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. వీటిలో పట్టణం చివరలో ఓ ప్రైవేటు వెంచర్‌లోని పార్కు స్థలంలో నిర్మించిన చిల్డ్రన్‌పార్కు, పట్టణానికి 2 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన ఆడిటోరియం ప్రారంభానికి సిద్ధంగా ఉండగా వివిధ కారణాలతో నేటికీ చేయలేదు. దీంతో చిల్డ్రన్‌పార్కు, ఆడిటోరియం నిర్వహణ లేక కళతప్పి పాతబడుతున్నాయి. 65వ జాతీయ రహదారిపై రూ.5 కోట్లతో నిర్మించిన సెంట్రల్ మీడియన్ పనులు నేటికీ అసంపూర్తిగా ఉన్నాయి. 2025 జనవరి నెలతో మున్సిపల్ పాలకవర్గం, కౌన్సిలర్ల పదవీ కాలం ముగిసిపోతుండడంతో సగం.. సగం పూర్తయిన అభివృద్ధి పనులు పాలకపక్ష, ప్రతిపక్ష కౌన్సిలర్లను వెక్కిరిస్తున్నాయి.

రూ.17 కోట్ల పనులకు గ్రీన్‌సిగ్నల్ ఏదీ?

గత పనులే అర్థాంతరంగా నిలిచిపోగా.. పాలకవర్గం మరో 37 అభివృద్ధి పనులను గుర్తించి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్‌ఐడీసీ) ద్వారా రూ.20 కోట్ల నిధుల కోసం గతేడాది అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ పరిపాలన ఆమోదం లభించక కలెక్టర్ కార్యాలయంలో మూలుగుతుంది. మరో పది కీలకమైన అభివృద్ధి పనులను గుర్తించి ఈ ఏడాది మార్చిలో టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా రూ.17 కోట్ల నిధులను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నేటికీ రాష్ట్ర సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు.

లోక్‌అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీన నిర్వహించే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య పేర్కొన్నారు. గురువారం కోర్టు పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించిన సందర్భంగా జడ్జి సౌజన్య మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో రాజీ చేయదగ్గ పోలీసు కేసులతో పాటు భార్యభర్తల తగాదాలు, ఎక్సైజ్ కేసులు, బ్యాంకు కేసులు పరిష్కరించే అవకాశమున్నందున కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెఫెల్ ఫోరం

రామచంద్రాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి పటాన్‌చెరు విద్యుత్ డివిజన్ ఉపకేంద్రంలో కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెఫెల్ ఫోరంను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంబీజీ సబ్‌స్టేషన్ ఏఈ శివశంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగే కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

క్రికెట్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి, డాక్టర్లు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2ను ఫిబ్రవరి2025లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం తన నివాసంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆవిష్కరించారు. ఐఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డా.ఆనంద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 8,9 తేదీల్లో సంగారెడ్డిలో స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు.

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



పీహెచ్‌సీలో 108 వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మెదక్ ఎమ్మెల్యే

చిన్నశంకరంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. చిన్న శంకరంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 108 అంబులెన్స్ వాహనాన్ని ఎమ్మెల్యే రోహిత్‌రావు జెండా ఊపి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కనీస సౌకర్యాలు కల్పించనున్నట్టు తెలిపారు. అనంతరం శాలిపేట పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులను విద్యాబోధనపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల స్థితిగతులపై ఉపాధ్యాయులతో మాట్లాడి, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ అనిలా, మండలవైద్యాధికారి సాయిసింధు పాల్గొన్నారు. కాగా కార్యక్రమం ముగిసిన అనంతరం తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ మండల ఆశ వర్కర్లు ఎమ్మెల్యే రోహిత్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కాగా మండలంలోని సంగాయిపల్లి గ్రామంలో మంచినీటి ఎద్దడి సమస్యను తీర్చాలని మిషన్ భగీరథ అధికారులకు ఎమ్మెల్యే రోహిత్ రావు ఫోన్ సమాచారం అందించారు. గ్రామస్థులు కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గురువారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మిషన్ భగీరథ అధికారులకు కాల్ చేసి తక్షణమే గ్రామంలో భగీరథ నీళ్లు అందించాలని ఆదేశించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులపై సర్కారు చిన్నచూపు తగదు



ఉద్యోగుల దీక్షకు మద్దతుగా మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నేత

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులపై సర్కారు చిన్నచూపు తగదని సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనీల్ చారి, శేషాద్రి, లక్ష్మణ్, రమేశ్, భాస్కర్, లలిత, రాణి, రజిత, భానుశ్రీ, సుజాత, కవిత, విష్ణు, నరేశ్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఉద్యమానికి పరోక్షంగా తూట్లు పొడవడం సరి కాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌సాబేర్‌అలీ పేర్కొన్నారు.

హామీలు ఇచ్చి విస్మరించిన ప్రభుత్వం

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక విస్మరించిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు గురువారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నెలలు గడుస్తున్నా సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు పెంచడం లేదని, రెగ్యులరైజ్ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేసి వారిని రెగ్యులరైజ్ చేసి వారికి వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు.